# ఎదురింటి నేస్తం

కేశిరాజు ఫణిప్రసాద్

**ఉదయం ఆరుగంటలు! గేటుకు గుచ్చిన పేపరుని తీసుకుని అరుగు మీద కుర్చీలో కుర్చున్నాను.**


**ఒక్క క్షణం పేపరులో మొదటి పేజీలో ముఖ్యమైన విషయాలు చదువుతూ అనుకోకుండా ఆగిపోయాను.**

చుట్టుపక్కల వాతావరణం నిశ్శబ్దంగా ఉంది. వెంటనే మా ఎదురింటిని పరిశీలనగా చూశాను.

ఎటువంటి అలికిడి లేదు. ఆశ్చర్యంగా అటే చూస్తున్నాను. ''అమ్మా ఇవ్వాళ కాలేజీకి త్వరగా వెళ్ళాలి. నీళ్ళు కాగాయా?'' 'వసుధా స్నానం చేసి రాగానే నాపేంట్, షర్టు రెడీగా ఉంచు.' అమ్మా.. నా హోమ్‌వర్క్ పూర్తి చేసిపెట్టమని రాత్రి నీకు మరీ మరీ చెప్పాను చేశావా?'...'ఏమిటమ్మా నువ్వు నా విషయం నువ్వు పట్టించుకోవు. నా బూట్లు పాలిష్ చేసి ఉంచమని చెప్పినా నువ్వు చెయ్యలేదు. ఇవ్వాళ స్కూల్లో పనిష్మెంట్ తప్పదు..''

''అమ్మగారూ గిన్నె తీసుకోండి. పాలు పోస్తాను. ఇంకా నేను ఎన్నో ఇళ్లకు వెళ్ళాలి..''

''ఈ జడ సరిగా కుదరటం లేదు..అమ్మా నువ్వు వచ్చి జడ వెయ్యి..''



ప్రతిరోజు మా ఎదురింటి పరిస్థితి ఎంతో హడావుడిగా ఉంటుంది. ఇంతమందికి అడిగినవన్నీ చేసిపెడుతూ అందరిని సమాధానపరచగల సహనశీలి ఆ ఇంటి ఇల్లాలు! వసుధ. పేరుకు తగిని మనస్తత్వం.

చంద్రశేఖరరావు గారు, ఆయన భార్య వసుధ. ఇద్దరు ఆడపిల్లలు. ఒక అబ్బాయి. వాళ్ళ కుటుంబం. ఆడపిల్లలిద్దరూ ఈ సంవత్సరమే కాలేజిలో చేరి ఇంటర్ చదువుతున్నారు. అబ్బాయి కాన్వెంట్‌లో చదువుకుంటున్నాడు. ఇక చంద్రశేఖరరావు గారు అడ్వకేట్ జనరల్. ఎప్పుడూ హడావుడిగానే ఉంటారు. పైగా డిసిప్లిన్ ఆయన ఊపిరి. వృత్తి ధర్మాన్ని ధర్మంగానే నిర్వర్తించటం ఆయన జీవిత ధ్యేయం.

ఒకవిధంగా చెప్పాలంటే చంద్రశేఖరరావుగారింట్లో హడావుడి మొదలయితే ఆ వీధిలో ఉంటున్న మాకందరికీ తెల్లవారినట్టే. చుట్టు పక్కల ఇళ్ళవాళ్ళు ఈ హడావుడికి అలవాటు పడిపోయారుకూడా.


మరీమధ్య చంద్రశేఖరరావుగారింట్లో ఈ నిశ్శబ్దానికి కారణం? నాలో అనుకోకుండా కలుగుతున్న తాపత్రయం! ''ఎదురింటి విషయం గురించి పేపరు చదబటం మానేసి మరీ ఆలోచించాలా?'' అంతరాత్మ కసురుకుంది.

అంతే. పేపర్‌ని మళ్ళీ మొదటినుంచి చదబటం ప్రారంభించాను. మాట వినని మనసు కుదురుగా ఉండనివ్వటం లేదు!

అప్రయత్నంగానే ఎదురింటివైపు దృష్టి మళ్ళింది. ''ఏమయిందో ఏమిటో..'' అనుకుంటూ స్తబ్దత చుట్టు ముట్టిన ఇంటినే చూస్తూ ఆలోచనల్లో పడ్డాను.

వాళ్లు ఏదైనా వూరు కానీ వెళ్లలేదు కదా? ఏమో..

రెండ్రోజులు టూర్ వెళ్లి రాత్రే వచ్చాను నేను కూడా. మా ఆవిడ సుమిత్ర..మాట్లాడకుండా పడుకుంది.




రేపొద్దున తనని అడగాలి అనుకున్నాక కాస్త మనసు కుదుటపడింది.

***

''కాఫీ తాగి త్వరగా స్నానం చేసి రండి. వెళ్ళాలి'' హడావుడిపడ్తోంది సుమిత్ర.

''ఎక్కడికి?'' అడిగాను.

''వసుధకి మొన్న కడుపులో నొప్పి వస్తే హాస్పిటల్‌కి వెళ్తూ నన్నూ తోడు తీసుకెళ్ళింది. డాక్టర్లు ఏవేవో పరీక్షలు చేసి హాస్పిటల్‌లో చేరమన్నారు. చేరింది. వాళ్ళాయన కూడా వూళ్లో లేకపోవడంతో... తనింట్లో పిల్లకి సాయంగా వుండమని అడిగింది.. అందుకే .. ఇంట్లో పన్లు త్వరగా చేసుకుని వెళ్లాలి..''

''మరి ఇంట్లో పిల్లలున్న అలికిడి లేదు.. నువ్వెళ్తే ఏం చేస్తావు?''

''వాళ్లకు తెలిసిన వాళ్లింటికి వెళ్లారు. నేను వంట చేసి మధ్యాహ్నం కారీర్ పంపాలి.. మీ లంచ్ టైంకి వచ్చేస్తా'' అంటూ వెళ్లిపోయింది.

సుమిత్ర కలుపుగోలు మనిషి. మా కాలనీవాళ్లందరితోనూ స్నేహంగా వుంటుంది. ముఖ్యంగా చంద్రశేఖర్రావు గారింట్లో ఆవిణ్ని తమ కుటుంబంలో ఒక మనిషిగా చూస్తారు. వసుధ తిరిగి యింటికొచ్చేదాకా మా ఆవిడకు స్థిమితం వుండదని అర్థమైపోయింది నాకు.

మెల్లగా లేచి స్నానానికి బయల్దేరాను.

***

''హమ్మయ్య'' అంటూ వచ్చింది సుమిత్ర. ''రండి.. మీకు భోజనం వడ్డిస్తా..'' అంటూ డైనింగ్ వైపు దారితీసింది. భోజనం వడ్డిస్తున్నంత సేపూ ఏదేదో మాట్లాడ్తునే వుంది.

''అవును సుమిత్రా. వసుధగారికి ఇద్దరమ్మాయిలు కదా.. వాళ్లకి ఇంటిపని, వంటపని రాదా?'' సందేహంగా అడిగాను.

''వాళ్లకా!.. స్టవ్ వెలిగించడం కూడా రాదు. ఎంతసేపూ కంప్యూటర్ ముందు కూర్చోవటం..నేర్చుకోవడం.. అన్నిపనులూ తల్లి చేసిపెట్టాల్సిందే. ఇక్కడ వస్తువు అక్కడ పెట్టరు..''

''పాపం అలాంటి ఆవిడకి ఈ అనారోగ్యం ఏమిటో...'' సానుభూతిగా అన్నాను.

హఠాత్తుగా సుమిత్ర కళ్ళలో నీళ్లు తిరిగాయి. కంగారుగా అడిగాను.... ''ఏమైంది సుమిత్రా...'' అని,

''మొన్న ఆదివారం భోజనాలయ్యాక వసుధ దగ్గరకు వెళ్లాను. పప్పు రుబ్బుతోంది. ఇంతలో వాళ్ల మ్మాయి కేకేసి మంచినీళ్లడిగింది. 'ఒక్కనిముషం' అంటూ వెళ్లి నీళ్లిచ్చి వచ్చింది. ఆమె అటు వెళ్లగానే నేను సాయం చేశాను. వొద్దంటూ నొచ్చుకుంది. ఆ తర్వాత 'బాత్‌రూంలో బట్టలు ఉతికిపెట్టు మమ్మీ' అంటూ మరో పిల్ల కేకేసి చెప్పింది. సరే అనుకుంటూ అటు వెళ్లింది. నాకు సహనం పోయి అడిగాను.

''వసుధా! మీ అమ్మాయిలిద్దరూ లోపల ఏంచేస్తున్నారు?''

''ఇవాళ ఆదివారం కదండీ..టివి చూస్తూ కబుర్లు చెప్పుకుంటారు.'' బట్టలకు సబ్బురాస్తూ అంది.

వసుధ మాటల్లో ఎటువంటి భావం లేదు.

నాకు ఒళ్లు మండింది. మరీ విడ్డూరం కాకపోతే ఆడపిల్లలై వుండి ఇంట్లో పనులు చేస్తూ తల్లికి కాసింత సాయంగా చేదోడు వాదోడుగా వుండొద్దూ.. అని. అదే మాట పైకి అడిగేశాను.

''ఎంత కాలేజి చదువులైతే మాత్రం.. ఇంట్లో పని ముట్టుకోకుండా వుండటమేమిటండీ?

''నిజమేననుకోండి. మొదట్నుంచీ లేని అల వాటు ఇప్పుడు రమ్మంటే ఎలా వస్తుంది చెప్పండి? రేపు పెళ్లయి అత్తవారింటికెళ్తే ఎలాగూ పనిచేయక తప్పదు..'' అంది భారంగా.

''మరి ఇప్పట్నుంచే పిల్లలు పనులు నేర్చుకోవాలి కదా...మీరొక్కరే రెక్కలు ముక్కలు చేసుకుంటూ ఇంత పని చేస్తున్నారు. రేపు మీకేదైనా అనారోగ్యం వస్తే పరిస్థితి ఏమిటి?'' అన్నాను ఆవేశంతో.

అప్పుడు వసుధ అసహాయంగా చూస్తుండిపోయింది.

''నిజంగా నాది పాపిష్టి నోరు... ఆ సాయంత్రమే వసుధ ఆస్పత్రిలో చేరింది.'' బాధపడ్తూ చెప్పటం పూర్తి చేసింది నాభార్య.

''సుమిత్రా. వసుధ తన పిల్లల ప్రవర్తన గురించి ఎప్పుడయినా నీతో చర్చించిందా?'' ఆరాగా అడిగాను.

''తన పిల్లలకి ఏపనీ రాదని ఏ తల్లి మాత్రం చెప్తుందని?..వసుధకి పిల్లలు బాగా చదివి పోటీపరీక్షల్లో నెగ్గాలని తపన. తన భర్తకి తనే స్వయంగా వండి, వడ్డించాలని తాపత్రయం..''

అవును. వాళ్లింట్లో మరో విషయం కూడా గమనించాను. ఆయనకు వంటమనిషిని పెట్టడం నచ్చదు. ఎప్పుడో మాటల సందర్భంగా ఆయనే అంటూండేవారు.

''హాస్పిటల్లో ఎన్నాళ్లుండాలో డాక్టర్లు చెప్పారా?''

''ఏమో. ఏవేవో పరీక్షలు చేస్తున్నారు. కడుపు నొప్పి అప్పుడప్పుడు వస్తుందట. ఈ సారి మాత్రం ఎక్కువగా వచ్చిందని చెప్తోంది. ఇవాళ వాళ్లాయన వస్తున్నారు. 'సుమిత్రా..నా పిల్లలకు ఏవస్తువు ఎక్కడుందో తెలీదు. వాళ్లంతట వాళ్లు ఏ పనులూ చేసుకోలేరు. మీరే మా పిల్లల్ని, ఇంటినీ చూసుకోవాలి అంటూ.. వసుధ కళ్లమ్మట నీళ్లు పెట్టుకుంటోంది...'' బాధపడ్తూ చెప్పింది.

అది కాదు సమస్య. ఈ సమస్యకి పరిష్కారం గురించి ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. అంతే. కర్తవ్యం స్ఫురించింది. నా నిర్ణయం విన్న సుమిత్రకు కూడా కొంత ఊరట కలిగింది.

***

ఆరోజు శనివారం. మధ్యాహ్నం. ఇంటికొచ్చాను. అక్కడ కన్పించిన దృశ్యం చూస్తే వేసిన ఆశ్చర్యం అంతా ఇంతాకాదు.

మా ఆవిడ వంటింటి గడప దగ్గర కూర్చుని బియ్యంలో రాళ్లు ఏరుతోంది. పక్కనే కూర్చున్న వసుధ కూతురు కూరలు తరుగుతోంది.

అప్పుడే అక్కడకొచ్చిన వసుధ రెండో కూతురు.. ''ఆంటీ బకెట్‌లో వాషింగ్ పౌడర్ ఎంతేయాలి?'' అని అడుగుతోంది.

నాకు ఆ సన్నివేశం చిత్రమైన ఆనందాన్నిచ్చింది.

''సుమిత్రా కాఫీ ఇస్తావుటోయ్...'' అన్న నా కేకకి హడావుడి పడ్తూ లేచింది మా ఆవిడ.

కానీ కాఫీ తెచ్చిచ్చింది మాత్రం వసుధ కూతురు. ''అంకుల్ కాఫీ తీసుకోండి..'' అంటూ.

''నేనే యిచ్చిరమ్మన్నాలేండి..'' అంటూ మా ఆవిడ ఆ అమ్మాయితో...''చూడమ్మా.. స్టవ్ మీద కూర కలియబెడ్తుండు. నేనిప్పుడే వస్తా..'' అంది.

ఆ అమ్మాయి అటు వెళ్లగానే అడిగా సుమిత్రను. ''వసుధ గారు ఎప్పుడొస్తారట ఆస్పత్రి నుంచి?''

''మరో పదిరోజులు పడ్తుందట. అప్పటిదాకా ఈ పిల్లలు ఇలా అవస్థపడక తప్పదు..'' అంటూ నిట్టూర్చింది.

ఆ రాత్రి పిల్లలతో సహా ఆస్పత్రికెళ్లి వచ్చింది. తిరిగొచ్చాక కబుర్లలో చెప్పింది. భోజనం పట్టుకెళ్లిన పిల్లలు కొసరి కొసరి తల్లిచేత తినిపించడం చూసిన వసుధ కళ్లు కన్నీటి భాష్పాలతో నిండిపోయాయని.

వసుధ సంతోషం మాట ఏమో కానీ, నాభార్యకి మాత్రం గొప్ప ఆనందాన్నిచ్చింది ఈ సంఘటన అని అన్పించింది నాకు.

***

ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టి ఆస్పత్రికెళ్లాను. అక్కడ నన్ను చూడగానే చంద్రశేఖర్రావుగారి కళ్లు ఆనందంతో మెరిసాయి.

''ఎలా వుందమ్మా ఇప్పుడు?'' అడిగాను వసుధను.

''ఇపుడిపుడే కోలుకుంటున్నానండీ..'' బెడ్‌మీంచి లేవబోతూ అంది.

''ఫరవాలేదు. పడుకోండి.'' అంటూ.. ఏవో మాటలు చెప్తూ అలా వాళ్ళిద్దరితో గంటకు పైగా గడిపా.

వచ్చేస్తుంటే... అన్నారు వాళ్లు ... ''మా వల్ల మీకెంతో ఇబ్బంది కలుగుతోంది కదూ'' అని.

''భలేవారే. ఎదురెదురిళ్లల్లో వుంటున్నాం. ఒకరి కొకరం మనం సాయం చేసుకోవడంలో శ్రమే ముంది..మీరు ధైర్యంగా వుండండి.. పిల్లల్ని మేము చూసుకుంటాం...'' అంటూ స్నేహంగా ఆయన భుజం తట్టి ఇంటికి బయల్దేరాను.

ఇంటికి రాగానే వసుధ పిల్లలు ఎదురొచ్చి అడిగారు.. ''అమ్మకెలా వుంది అంకుల్''అంటూ.

''పరవాలేదమ్మా. మీ అమ్మగారు కులాసాగానే వున్నారు. ఏం ఫర్వాలేదు. తగ్గిపోతుంది..''

వాళ్లు లోపలికెళ్లాక అంది సుమిత్ర. ''తల్లి గురించి పిల్లలు దిగులు పడ్తున్నారు. వాళ్ల దిగులు పోగొట్టాలనే పనులు చేయిస్తున్నా.. ఆ ధ్యాసలో పడి కొంతవరకైనా మర్చిపోతారని...''

''అలా అని పిల్లల్ని హైరాన పెట్టకు'' అన్నాను గభాల్న. నా మాటలకు చురుక్కున చూసింది నావైపు.

వెంటనే నవ్వి చెప్పా. ''మాటవరసకు అన్నాలే వోయ్. వసుధగారు పిల్లల్ని ఎంత గారాబంగా చూసుకుంటారో నీకే తెలుసు కదా...మా పిల్లలు పని చేస్తే ఏమైపోతారో అని అనుకునేరు..''

నామాటలకు తనూ నవ్వింది.

***

''అంకుల్ త్వరగా రండి. దేవుడి ప్రసాదం తీసుకుందురుగాని..'' వాళ్లబ్బాయి హడావుడి చూసి ''ఏమిటి విషయం?'' అడిగాను.

''మన వసుధని రేపు పొద్దుటే ఇంటికి పంపించేస్తున్నారండీ..'' చెప్పింది మా శ్రీమతి ముఖమంతా నవ్వుచేసుకుని ఎదురొస్తూ.

''అవునంకుల్. అమ్మ ఇక యింటికెళ్లిపోవచ్చని చెప్పారు డాక్టర్లు..'' వంటింట్లోంచి వస్తూ చెప్పారు ఇద్దరాడపిల్లలు.

వాళ్లందరి కళ్లల్లో ఎంత సంతోషమో మాటల్లో చెప్పలేకపోతున్నా.

ముగ్గురు పిల్లల్ని దగ్గరకు తీసుకున్న సుమిత్ర ప్రేమగా అంది. ''పసి వెధవలు. తల్లి కోసం ఎంతగా తల్లడిల్లిపోతున్నారో. వాళ్లమ్మ హాస్పిటల్ నుంచి త్వరగా వస్తే కొబ్బరికాయ కొడతానని మొక్కుకున్నాడుటండీ వీడు..'' అంది అబ్బురంగా.

నాక్కూడా ఆ వార్త అమితానందాన్నిచ్చింది. ఎదురింట్లో పెళ్లి సందడి మళ్లీ మళ్లీ చూడాలని మనసు కోరుకుంది.

***

అనుకున్నట్టుగా వసుధ ఆరోగ్యంగా ఇంటికి తిరిగొచ్చింది. ఈ మాటను సుమిత్ర ఎన్నిసార్లు అనుకుందో తృప్తిగా.

చంద్రశేఖర్రావు గారిల్లు కొత్త కళతో కళకళలాడిపోతోంది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన మా దంపతుల్ని డిన్నర్‌కి పిల్చారు ఎంతో సాదరంగా.

డైనింగ్ హాల్లో అరటి ఆకుల్లో భోజనం. మా ఇద్దరి జంటలు ఎదురెదురుగా కూర్చున్నాం. పిల్లలు వడ్డన చేస్తున్నారు పెళ్లివారికి వడ్డిస్తున్నంత హడావుడి పడిపోతున్నారు.

''ఇంత చక్కటి భోజనం మనం కలిసి ఆరగిస్తామని నేనే అనుకోలేదు సుమా..'' అన్నారాయన గోంగూర పచ్చడిని మరి కాస్త వేయించుకుంటూ.

నిజం చెప్పొద్దూ నాకూ ఆనందంగానే వుంది అలా అందరం కలిసి సహపంక్తి భోజనం చేయడం. దానికంటేకూడా ఆ పిల్లల్లో వచ్చిన మార్పు కనుల పండువుగా, మహావిందుగా వుంది. అలా కలివిడిగా, హడావిడిగా యింటి పనులను చకచకా చేయడం చూస్తుంటే ముచ్చటేసింది.

ఇదంతా గమనించిన వసుధ అంది..'' పిల్లల్ని ఇలా మార్చేసిన పుణ్యం అంతా అక్కయ్యగారిదే.'' అంటూ అభినందనగా మా ఆవిడ వైపు చూసింది.

''నిజమేనండీ. మా పిల్లలకు చక్కగా పనులు నేర్పారు. వాళ్లకిప్పుడు మాటా మంచీ తెల్సింది. కష్టం సుఖం తెలుసుకున్నారు. మీ మేలు- మాటల్లో ఎలా చెప్పాలో తెలీడం లేదు. ఊహూ. అసలు అభినందించడానికి మాటలు లేవు..'' అన్నారాయన ఎంతో ఉద్వేగంతో.

సుమిత్ర, వసుధలు ఒకరివైపు ఒకరు చూసుకుంటూ నవ్వుకున్నారు. వారిద్దరి కళ్లల్లోనూ కన్నీటి తెరలు కమ్ముకున్నాయి.

ఒకరిది కృతజ్ఞతా భావం. మరొకరిది తల్లితనం.

తనకు పిల్లలు లేకపోయినా ఈ పదిరోజులూ...తన పిల్లల్లా చూసుకుని మురిసిపోయిన సుమిత్ర మనసు బోసిపోవడం నేను గమనించాను. అయినా ఆమెలోని అమ్మతనం నిండుగా తొణికిసలాడ్తుంటే అంది..

''ఇదంతా నా గొప్ప కాదు. పిల్లలు చెప్పింది విని, చక్కగా నేర్చుకున్నారు. వాళ్లదే ఈ గొప్పతనం...'' అంటూ పిల్లల వైపు ప్రేమగా చూసింది సుమిత్ర.

ఆ క్షణంలో మా ఎదురింటి వాళ్లు- ఎదనిండిన వాళ్లులా కన్పించారు.

★



## సూపర్ బిపాసా

వొళ్లంతా శృంగారం చేసుకున్న ఏకైక నటి బిపాసాబసు. వెండితెరమీద అభినవ రంభ. బిపాసా సినిమా అంటే ప్రేక్షకులకు ప్రత్యేకమైన అంచనాలు, ఆశలు (?) వుండటం సహజం. (అది ఆమె జిస్మ్ ప్రభావం.) తన కొత్త షికార్‌లో బిపాసా ఒక సూపర్‌మోడల్‌గా నటిస్తుంది. ఆ పాత్ర ఎలాంటిదంటే- ఆమె కెరీర్‌లో ఎంతో సాధిస్తుంది కానీ, మనసు నిండదు. తను ప్రేమించిన వాడితో స్థిరపడి, ఝుమ్మంటూ కాపురంచేసుకోవాలని గాఢంగా కోరుకుంటుంది. అద్భుతంగా నటించిపారేయొచ్చు అని ఎగిరిగంతేసి ఒప్పుకుంది బిపాసా. ఎందుకంటే నిజజీవితంలో బిపాసా జాన్‌తో కోరుకుంటున్న జీవితం కూడా ఇదే కదా! అందుకే కామోసు తనకీ కథ పిచ్చిపిచ్చిగా నచ్చేసిందని, అందుకే నటించడానికి సై అన్నానని తెగ ఉత్సాహంతో చెప్తోంది. సూపర్‌మోడల్ పాత్రలో బిపాసా అందాలు కూడా సూపర్‌గా వుంటాయనే సినీవర్గాల వారి ఉవాచ! ఈ సినిమా కన్నులపండుగే మరి.